క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు నుంచి జారిపడి మహిళ మృతి

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ బస్టాండ్ సమీపంలో బస్సు దిగే ప్రయత్నంలో జారిపడి ఒక మహిళ మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపిన వివరాలా ఉన్నాయి. కాజులూరు మండలం జగన్నాథగిరి గ్రామానికి చెందిన మిర్తిపాటి దమయంతి (65) కిరాణా వ్యాపారం సాగిస్తూ జీవిస్తున్నారు. ఆమె మంగళవారం కిరాణా షాపులో సరకుల కోసం ద్రాక్షారామ ఆర్టీసీ బస్సులో రాగా ద్రాక్షారామ బస్టాండులోకి బస్సు వెళుతున్న సమయంలో బస్సు నుంచి దిగే ప్రయత్నం చేయగా, ప్రమాదవశాత్తూ జారి కింద పడ్డారు. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకుని వెళ్లగా ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో ఆసుపత్రి సమాచారం , బంధువుల పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శాస్త్రీయ పద్ధతిలో పశుపోషణ మేలు



తాపేశ్వరంలో అవగాహన కల్పిస్తున్న రాజేశ్వరరావు

కపిలేశ్వరపురం (మండపేట): శాస్త్రీయ పద్ధతిలో పశు పోషణ చేపట్టడం ద్వారా మేలైన ఫలితాలను దక్కించుకోవచ్చని కేంద్రీయ పశు నమోదు అధికారి డి.రాజేశ్వరరావు అన్నారు. మండపేట మండలం తాపేశ్వరంలో కేంద్రీయ పశు నమోదు పథకం, మత్స్య, పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛత అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతు అవగాహన కార్యక్రమంలో భాగంగా కేంద్రీయ పశు నమోదు అధికారి డి.రాజేశ్వరరావు పాడి రైతులకు పలు అంశాలను వివరించారు.

రేపు అంగరలో వ్యాసరచన పోటీలు

కపిలేశ్వరపురం: అంగర గ్రామానికి చెందిన తోరాటి లక్ష్మణమూర్తి జయంతిని పురస్కరించుకుని శుక్రవారం అంగర జెడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్టు తోరాటి లక్ష్మణమూర్తి విజ్ఞాన కేంద్రం నిర్వాహక నాయకుడు పెద్దింశెట్టి లక్ష్మణమూర్తి బుధవారం తెలిపారు. తెలంగాణ సాయుధ భూ పోరాటంలో లక్ష్మణమూర్తి పాల్గొని వీరమరణం పొందారని, ఈనెల 13న ఆయన జయంతి సందర్భంగా 'సామాజిక సమస్యలు - విద్యార్థుల పాత్ర' అంశంపై వ్యాసరచన, సంస్మరణ కార్యక్రమాలను నిర్వహించనున్నామని లక్ష్మణమూర్తి తెలిపారు.

ఘనంగా అన్నసమారాధన

కాజులూరు: మండలంలోని గొల్లపాలెం కొత్తపేటలో గ్రామస్తులు బుధవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. గ్రామంలోని కాకినాడ-కోటిపల్లి రహదారిలో కనకదుర్గమ్మ ఆలయ వద్ద ఇటీవల దేవీనవరాత్ర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో అమ్మవారికి వచ్చిన విరాళాలకు తోడు పలువురి దాతల సహకారంతో ఈ అన్నసమారాధన నిర్వహించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పరిసర గ్రామాలకు చెందిన సుమారు రెండు వేల మంది భక్తులు ఈ అన్నసమారాధన కార్యక్రమాల్లో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

పాఠశాల క్రీడా ఎంపికలను సద్వినియోగం చేసుకోండి

కాజులూరు: గొల్లపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం, శుక్రవారాల్లో జరగనున్న మండల పాఠశాలల క్రీడా ఎంపికల్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో జె.రాంబాబు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ త్వరలో మండల గ్రామాల్లో అండర్-14 అండర్-17 బాలుర, బాలికల విభాగంలో కోకో, కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు జరగనున్నాయన్నారు. ఈ పోటీల్లో క్రీడాకారులను ఎంపిక చేసేందుకు గొల్లపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం బాలుర విభాగానికి, శుక్రవారం బాలికల విభాగానికి సెలక్షన్స్ జరుగనున్నాయన్నారు. అండర్-17 విభాగానికి 1.1.2009 తరువాత జన్మించిన వారు, అండర్-14 విభాగానికి 1.1.2012 తరువాత జన్మించిన వారు అర్హులన్నారు. ఉదయం 9 గంటలకు గొల్లపాలెం హైస్కూల్‌లో ఎంపిక ప్రారంభమౌతుందని, పాల్గొనే విద్యార్థులకు భోజన వసతులు ఏర్పాటు చేశామన్నారు. మరింత సమాచారం కోసం మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్, గొల్లపాలెం పీడీ జి.సునీల్‌కుమార్ 9491442913ను సంప్రదించాలన్నారు.

27 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కపిలేశ్వరపురం (మండపేట): వివిధ కారణాలతో బాధపడుతూ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన నియోజకవర్గంలోని 27 మందికి మండపేటలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చేతుల మీదుగా రూ.10,87,536 విలువైన సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సాయం చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు తెగుళ్ల బెడద

- ఎండ వేడిమితో వరిలో ఎండాకు తెగులు
- పంట పొలాల్లో వేగంగా వ్యాప్తి
- దిగుబడిపై ప్రభావం
- ఆందోళనలో రైతులు



ఎండాకు తెగులు సోకిన పొలం



పంటకు సోకిన ఎండాకు తెగులు

రామచంద్రపురం రూరల్: వాతావరణంలో మార్పులు, కలుషిత నీరు, నత్రజని అధికంగా వాడటం వంటి వాటివల్ల వరి పంటలో ఎండాకు తెగులు సోకుతుందని, తీసుకోవాల్సిన నివారణ చర్యలు, సోకిన తరువాత తీసుకోవాల్సిన నష్ట నివారణ చర్యల గురించి రామచంద్రపురం మండల వ్యవసాయ అధికారి టీవీఆర్ మణిదీప్ వివరించారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని మూడు మండలాల్లో సుమారు 54 వేల ఎకరాల్లో, మండపేట నియోజకవర్గంలోని మండల గ్రామాల్లో సుమారుగా 58 వేల ఎకరాల్లోను రైతులు ఖరీఫ్ వరి సాగు చేపట్టారు. సాధారణంగా ఖరీఫ్‌లో స్వర్ణ రకం వరిని పండిస్తుంటారు. ప్రస్తుతం ఆయా నియోజకవర్గంలోని వరి పంట పొలాలు ముదరగా వేసిన పొలాల్లో ఈనిక దశలో ఉండగా లేతగా ఊడ్చిన పంట పొలాలు ఈనిక దశలో ఉన్నాయి. విచిత్ర వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో దాదాపుగా 30 శాతం పంట పొలాల్లో ఈ ఎండాకు తెగులు సోకినట్లు తెలుస్తుంది. దుబ్బు చుట్టూ ఉన్న ఆకులు లేత పసుపు రంగులోకి మారి తరువాత ఎండిపోయి చనిపోవటంతో వరి దుబ్బులు బలహీన పడతాయి. దీంతో ఈనిక దశలో ఉండే దుబ్బులు ఈనిక రాకుండా పోవటంతో దిగుబడి తగ్గిపోతుంది. తెగులు సోకిన వరి మొక్కల ఆకులు బూడిదరంగు చారికలు ఏర్పడి వాటి నుంచి తెల్లగా జిగురు పదార్థం స్రవిస్తుంది. దీంతో దుబ్బు నుంచి మరో దుబ్బుకు వేగంగా ఎండాకు తెగులు వ్యాప్తి చెందుతుంది. వరిచేలల్లో సోకే తెగుళ్లలో ప్రమాదకరమైనది ఈ ఎండాకు తెగులు. చిరు పొట్ట దశలోని గింజలపై ప్రభావం చూపి గింజలను గట్టిపడకుండా ఈ తెగులు చేస్తుంది. రామచంద్రపురం మండలంలోని వెలంపాలెం ఈ వ్యాధి కనిపించిందని ఏఓ తెలిపారు. వరి పంటలో బాక్టీరియల్ లీఫ్ బ్లైట్ (వరిలో బాక్టీరియా ఆకు ఎండు తెగులు) వరి మొక్కలపై అత్యంత ధ్వంసకరమైన వ్యాధి. మొక్కల ఆకుల చివరల నుంచి మిడిభాగం వరకు పసుపు రంగు నీటి మచ్చలు ఏర్పడి తరువాత ఆకులు ఎండి పోతాయి. ఆకులపై ఉదయం వేళలో పసుపు రంగు జిగురు(బాక్టీరియా) కారడం కనిపిస్తుంది. ఇది గాలితో ఇతర మొక్కలకు వ్యాప్తి చెందుతుంది. ఎండు భాగాలు తరంగాల మాదిరిగా ఉంటాయి. ఈ దశను క్రైసిస్ దశ అంటారు. పూలు, లోపలి ఆకులు, పసుపు, గోధుమ రంగుల్లోకి మారి ఎండిపోతాయి. మొక్కల వృద్ధి కుంటుపడుతుంది. దిగుబడి 80 శాతం వరకు నష్టం కలుగుతుంది. అధిక తేమ, ధారాల వర్షాలు ఆకు ఎండు తెగులు వ్యాప్తికి దోహదం చేస్తాయి. ఎక్కువ నత్రజని ఎరువుల వాడకం, దగ్గరగా పంటలు నాటడం, వ్యాధి వ్యాప్తికి కారణాలు. బాక్టీరియా బాధిత మొక్కల ద్వారా సాగునీటి ద్వారా, గాలి ద్వారా వ్యాప్తి జరుగుతుంది.

నత్రజని వాడకం నిలిపివేయాలి



వాతావరణ పరిస్థితుల్లో మార్పుల కారణంగా పంట పొలాల్లో ఎండాకు తెగులు అధికంగా వ్యాపిస్తుంది. దీని నివారణకు ముందుగా వరిలో నత్రజని వాడకాన్ని పూర్తిగా నిలిపివేయాలి. పంట చేలలో మురుగునీటిని తొలగించాలి. ప్లాంటమైసిన్, బాక్టీరియామైసిన్ 100 గ్రాములు కలిపి పిచికారీ చేస్తే ఎండాకు తెగులును నివారించవచ్చు. వరిలో తెగుళ్లు, పురుగులను తట్టుకునే శక్తి రావాలంటే ఎకరానికి 20 కేజీల పొటాష్, 5 కేజీల యూరియాతో పాటు వేయాలి. ఎండాకు తెగులు అధికంగా ఉంటే వ్యవసాయాధికారులను సంప్రదించి తగు చర్యలు చేపట్టాలి

– టీవీఆర్ మణిదీప్, ఏవో, రామచంద్రపురం

రాజ్యాంగ విలువలపైనే దాడి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మురళి, కృష్ణమూర్తి తదితరులు

రామచంద్రపురం: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి యత్నించడం రాజ్యాంగ విలువలపై దాడి చేసినట్టేనని, దాడికి పాల్పడిన నిందితుడు రాకేష్ కిషోర్‌ను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని, రామచంద్రపురం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడె పిల్లి మురళీమోహన వెంకటరమణ, రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకులు బి.సిద్ధూ, ఎం.రాము, వెంటపల్లి భీమశంకరం, మద్ద కృష్ణమూర్తి తదితరులు అన్నారు. సుప్రీం కోర్టు సీజేఐ బీఆర్. గవాయ్‌పై దాడిని ఖండిస్తూ, బుధవారం ప్రధాన రహదారిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాలు, దళిత నాయకుల ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. వారు మాట్లాడుతూ జస్టిస్ గవాయ్‌పై దాడికి యత్నించిన న్యాయవాదిని అతని హోదా నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలి కోరారు. ధర్నాకు ముందుగా నేతలు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు అర్పించి నివాళులు ఘటించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు దొమ్మలపాటి సత్యనారాయణ, నాయకులు పెద్దిరెడ్డి రాము, వెంటపల్లి రామకృష్ణ, పైన సుధాకర్, మైనార్టీ నాయకులు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రహదారి నిర్మించాలంటూ నిరసన



కాకినాడ-కోటిపల్లి రహదారిపై మానవహారంగా నిలబడి నిరసన తెలుపుతున్న విద్యార్థులు

కాజులూరు: మండలంలో అసంపూర్తిగా నిలిచిపోయిన గొల్లపాలెం, కుయ్యేరు రహదారిని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం పలువురు విద్యార్థులు నిరసన చేపట్టారు. గొల్లపాలెం -కుయ్యేరు రహదారిని ముఖద్వారంలో కాకినాడ-కోటిపల్లి రహదారిపై మానవహారం చేపట్టి ధర్నా నిర్వహించారు. ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.రాజశేఖర్, వల్లు రాజబాబు, స్థానిక నాయకులు మాధవరపు నానాజీ, కడలి రాంపండు, షాజహాన్ తదితరులు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా రోడ్డు శిథిలావస్థకు చేరుకుని రాకపోకలకు ఇబ్బందిగా మారటంతో గత ప్రభుత్వం రూ.37 కోట్లు నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించిందన్నారు. నిధుల విడుదలలో జాప్యం కారణంగా పనులు నిలిచిపోయాయన్నారు. కూటమి నాయకులు అధికారంలోకి వస్తే ఆరునెలల్లో రోడ్డు నిర్మిస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేసి 15 నెలలు గడుస్తున్నా పనులు ముందుకు సాగడం లేదన్నారు. గొల్లపాలెం నుంచి కుయ్యేరు వరకూ 13 కిలోమీటర్ల రోడ్డు గోతులుగా మారడానికి తోడు చేదువాడలోని కోరంగి కెనాల్‌పై వంతెన, కాజులూరులోని అంద్రంగి డ్రెయిన్‌పై వంతెనలు పూర్తిగా శిథిలమై వాహనాల రాకపోకలకు వీలు లేకుండా ఉన్నాయన్నారు. రోడ్డు నిర్మించాలంటూ గతంలో పలుమార్లు ఆందోళనలు, ధర్నాలు, రోడ్డుపై వంటా, వార్పు నిర్వహించినప్పటికీ పాలకులలో చలనం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్డు, వంతెన నిర్మాణాలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



పామర్రులో సభ్యత్వాలను సేకరిస్తున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసు తదితరులు

కె.గంగవరం: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో తమ వంతు కృషి చేస్తామని ఆపస్ (ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సమితి) జిల్లా అధ్యక్షుడు వాడ్రేవు శ్రీనివాసు అన్నారు. మండలంలోని పామర్రు, యండగండి, కూళ్ల, పాణింగపల్లి, సత్యవాడతో పాటు పలు పాఠశాలల్లో సంఘ సభ్యులతో పాటు ఆయన పర్యటించి సభ్యత్వాలను నమోదు చేశారు. ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో ఆపస్ సంఘం ముందుంటుందని ఎవరికి ఏ సమస్య వచ్చిన వెంటనే తనను సంప్రదిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బాకాయిల విషయంలో కూడా పోరాటం చేస్తామన్నారు. కార్యదర్శి పోలిశెట్టి సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయుడు ఎర్ర ఈశ్వరుడు, ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, కందుల శ్రీనివాస్, సీహెచ్ గోపాలకృష్ణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు అంబాజీపేట విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన అంబాజీపేట విద్యార్థులు

అంబాజీపేట: గ్రామ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్) ఉమ్మడి తూర్పుగోదావరి స్థాయిలో నిర్వహించిన వివిధ క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. అండర్-19 నెట్‌బాల్ విభాగంలో కేఎల్‌డీఎస్ పూర్ణిమ (జూనియర్ ఇంటర్), అండర్-14 నెట్‌బాల్ విభాగంలో పి.జాహ్నవి, వై.జనార్దన్, అండర్-19 బాస్కెట్‌బాల్ విభాగంలో ఎం.మౌనిక, తైక్వాండో అండర్-14 విభాగంలో కె.కావ్య, అండర్-17 విభాగంలో పి.చరణ్యశ్రీ ఎంపికయ్యారని పీడీ కుంపట్ల ఆదిలక్ష్మి, పీఈటీ ఆకుల ఉమామహేశ్వరరావు, తైక్వాండో కోచ్ పి.త్రిమూర్తులు తెలిపారు. ఎంపికైన వారిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కడలి సాయిరాం, కాలేజ్ ఇన్‌చార్జ్ ఫణి, పీఈటీ సూర్యకుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.

స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి

పి.గన్నవరం: స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేసేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్ సూచించారు. ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమంలో భాగంగా మండల బీజేపీ అధ్యక్షుడు తిక్కా సత్తిబాబు ఆధ్వర్యంలో స్థానిక బీవీఆర్ కాంప్లెక్స్‌లో బుధవారం జిల్లా కార్యశాల సమావేశం జరిగింది. జిల్లా పార్టీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పెద్దిరెడ్డి ముఖ్య అతిథిగా మాట్లాడారు. స్వదేశీ మంత్రంతో భారత ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. ప్రతి ఇంటికీ ఈ నినాదాన్ని తీసుకువెళ్లాలని అన్నారు. దీని కోసం మండలానికి ఒక కన్వీనర్, ఇద్దరు కో కన్వీనర్లను నియమిస్తున్నట్టు వివరించారు. బీజేపీ జాతీయ కార్యవర్గ మండలి సభ్యుడు మానేపల్లి అయ్యాజీ వేమా మాట్లాడుతూ స్వదేశీ వస్తువులను ప్రోత్సహిస్తూ భారత్‌ను అగ్రగామిగా నిలపాలన్నారు. జాతీయ అధికారిక భాష హిందీ సలహా కమిటీ సభ్యుడిగా నియమితులైన ఎస్.సాధిక్‌ను ఘనంగా సత్కరించారు. రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి చీకరమెల్లి శ్రీనివాసరావు, మాలే శ్రీనివాస నగేష్, గొల్లకోటి వెంకటరెడ్డి, తమలంపూడి రామకృష్ణా రెడ్డి, విళ్ల సత్యనారాయణ, సలాది వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

మరింత ఉన్నత స్థానానికి చేరుకోవాలి

మామిడికుదురు: జీఎస్టీపై కోనసీమ జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జూనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతి సాధించిన మామిడికుదురు జెడ్పీహెచ్ ఎనిమిదో తరగతి విద్యార్థిని చింతలపూడి అలివేలు మంగతాయారును బుధవారం ఉపాధ్యాయులు అభినందించారు. స్కూల్ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో హెచ్ఎం బొండాడ చిరంజీవి, ఉపాధ్యాయుల బృందం మంగతాయారును సత్కరించారు. ఆమెకు జ్ఞాపికను అందజేశారు. స్కూల్‌కు మంచి గుర్తింపు తీసుకు వచ్చిందంటూ ఆమెను అభినందించారు. మరింత ఉన్నత స్థానానికి చేరుకోవాలని అభిలాషించారు. ఆమెకు గైడ్‌గా వ్యవహరించిన టీచర్ ఎం.గంగాభవానిని కూడా అభినందించారు.

గర్భిణులు, రోగుల సమస్యలు తీర్చండి



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు

అంబాజీపేట: అంబాజీపేట, ముక్కామల పీహెచ్‌సీల్లో ప్రసవాలు జరిగేందుకు అవకాశాలు లేకపోవడంతో పి.గన్నవరం సీహెచ్‌సీకి వెళుతున్నారని అక్కడ మత్తువైద్యురాలు అందుబాటులో లేకపోవడంతో గర్భిణులు నానా ఇబ్బందులు పడుతున్నారని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ దృష్టికి ప్రజాప్రతినిధులు తీసుకువచ్చారు. అంబాజీపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. పుల్లేటికుర్రు సర్పంచ్ జల్లి బాలరాజు మాట్లాడుతూ వైద్య సిబ్బంది సుఖ ప్రసవాలకు ప్రభుత్వ ఆసుపత్రులకు రావాలని ప్రచారం చేస్తున్నారని అయితే ఆపరేషన్లు నిర్వహించే విషయంలో మత్తు వైద్యురాలు అందుబాటులో లేకపోవడంతో రోజుల తరబడి గర్భిణులు, రోగులు ఆపరేషన్ల కోసం వేచి చూస్తున్నారని ఎమ్మెల్యే సత్యనారాయణ దష్టికి తీసుకువచ్చారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే ఈ సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వివరించారు. అలాగే పుల్లేటికుర్రులో గతంలో నిర్మించిన పైపులైన్లు పనులు సరిగ్గా చేయకుండానే జల్ జీవన్ మిషన్ పనులు చేపట్టారని దాంతో గత పైపులైన్లు నిధులు గాలిలో కలసిపోయాయని ఎంపీటీసీ పబ్బినీడి రాంబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జయశ్రీని ప్రశ్నించారు. గ్రామాల్లో ఆర్వో ప్లాంట్ల ద్వారా అందిస్తున్న తాగునీరు శుద్ధి కావడం లేదని, ఆర్వో ప్లాంట్లు ద్వారా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో 20 లీటర్ల టిన్నును రూ.15 పైబడి విక్రయిస్తున్నారని ఇసుకపూడి ఎంపీటీసీ ముత్తాబత్తుల ప్రశాంత్‌కుమార్ అధికారులను ప్రశ్నించారు. ఆర్వో ప్లాంట్లపై అధికారులు తనిఖీలు నిర్వహించాలని ఆయన కోరారు. అనంతరం వివిధ శాఖల అధికారులు ఆయా పథకాలను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే గిడ్డిని ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. సమావేశంలో జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, నీటిపారుదల శాఖ డైరక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, ఎంపీటీసీలు, సర్పంచులు, సొసైటీ చైర్మన్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాణసంచా సీజ్

కొత్తపేట: స్థానిక ఆర్ఎస్ నగర్ ప్రాంతంలో అనధికారిక బాణసంచా సామగ్రి సీజ్ చేసినట్టు ఎస్సై జి.సురేంద్ర బుధవారం తెలిపారు. బాణసంచా తయారీతోపాటు నిల్వలున్నాయని అందిన సమాచారం మేరకు రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఎస్సై సురేంద్ర, సిబ్బంది దాడి చేశారు. ఒక వ్యక్తి ఇంటి పక్కన బాణసంచా తయారీకి సంబంధించి సుమారు రూ.1.04 లక్షలు విలువైన సామగ్రిని గుర్తించి సీజ్ చేసినట్టు పేర్కొన్నారు.

జాతీయ రహదారిని ముంచెత్తిన భారీ వర్షం



మామిడికుదురులో జాతీయ రహదారిపై నిలిచిన వర్షం నీరు

మామిడికుదురు: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లో రోడ్లపై భారీగా వర్షం నీరు నిలిచింది. ఉదయం ఎండ కాసింది. తర్వాత క్రమేపీ కారుమబ్బులు కమ్ముకుని భారీ వర్షం కురిసింది. ఈ భారీ వర్షంతో మామిడికుదురులోని 216వ నంబర్ జాతీయ రహదారిపై నీరు నిలిచింది. పాత పోలీస్‌స్టేషన్ వద్ద నుంచి బోయి భీమన్న స్మారక భవనం వరకు జాతీయ రహదారిపై ముంపు నీరు నిలవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం నీరు ఎటూ వెళ్లే పరిస్థితి లేక పోవడంతో అది రోడ్డుపై నిలిచిపోతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. భారీ వర్షం కురిసిన ప్రతిసారీ ఇదే సమస్య ఏర్పడుతోందన్నారు. ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించే దిశగా డ్రైనేజీ సదుపాయం కల్పించాలని స్థానికులు డిమాండ్ చేశారు.

వెంకటేశ్వరరావు కుటుంబానికి చైర్‌పర్సన్ పరామర్శ



మండపేటలో వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

కపిలేశ్వరపురం (మండపేట): ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన మండపేట మున్సిపాలిటీ రికార్డు అసిస్టెంట్ మేడిశెట్టి వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు మందపల్లి రవికుమార్, పిల్లి శ్రీనివాసు, షేక్ అలీఖాన్ బాబా, ముక్కా సుబ్రహ్మణ్యం , యరమాటి వెంకన్నబాబు, జొన్నపల్లి సత్తిబాబు, మొండి మురళి, అంధనాపల్లి రవి ఉన్నారు.

పేలుడు ఘటనపై విచారం

కపిలేశ్వరపురం (మండపేట): రాయవరం బాణసంచా పేలుడు ఘటనపై మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతిని వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ప్రభాకరరావు, రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ వేర్వేరు ప్రకటనల్లో విచారం వ్యక్తం చేశారు.

ముగిసిన క్రీడా పోటీలు



కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

కె.గంగవరం: మండలంలోని పామర్రు ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గత రెండు రోజులుగా జరుగుతున్న క్రీడా పోటీలు బుధవారం సాయంత్రంతో ముగిశాయి. మండలంలోని అన్ని పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు అండర్-14, 17 బాలురు, అండర్-14, 17 బాలికల విభాగంలో వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ, ఖోఖో, లాంగ్‌జంప్, హైజంప్‌తో పాటు పలు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, జట్టులను పీఈటీలు ఎంపిక చేశారు. ఎంఈఓ నాగరాజు మాట్లాడుతూ మండల స్థాయిలో ఎంపిక పూర్తయిందని వీరిని నియోజకవర్గ స్థాయిలో పోటీలకు పంపిస్తామన్నారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు బహుమతులతో పాటు మెమెంటోలు అందిస్తామన్నారు. ఉన్నత పాఠశాల పీడీ సురేష్, పీఈటీలు కనకదుర్గ, కామేశ్వరి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


చైర్ పర్సన్‌కు జగ్గిరెడ్డి అభినందనలు



మండపేటలో చైర్ పర్సన్ దుర్గారాణిని అభినందిస్తున్న జగ్గిరెడ్డి, పాపారాయుడు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మున్సిపాలిటీకి స్వచ్ఛ అవార్డు దక్కేలా విశేష కృషి చేసిన మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అభినందనలు తెలిపారు. మండపేట పట్టణం కామత్ ఆర్కేడ్‌లో బుధవారం చైర్ పర్సన్‌ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైర్ పర్సన్‌గా దుర్గారాణికి మండపేట పురపాలక సంఘాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసిన ఘనత దక్కుతుందన్నారు. అభినందించిన వారిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, కౌన్సిలర్ మందపల్లి రవికుమార్, నాయకులు కురుపూడి రాంబాబు, షేక్ అలీఖాన్ బాబా, సాధనాల శివ భగవాన్, కోళ్ల నాని, కర్రి నాగిరెడ్డి ఉన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



దాత బోరయ్యకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ప్రధానార్చకుడు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి కాజులూరు మండలం జగన్నాథగిరికి చెందిన గుత్తుల బోరయ్య, విజయలక్ష్మి దంపతులు బుధవారం రూ.10,116 విరాళం సమర్పించారు. ఈ సొమ్మును ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.